
*శారీరక లోపాల నుండి, ప్రత్యుత్పత్తి దోషాల వత్తిడి నుండి, సౌందర్య కొలమానాల గీటురాళ్ల భారం నుండి స్త్రీలు విముక్తమయ్యే సామాజిక పరిసరాలు కావాలి. అవి లేనప్పుడు స్త్రీ సమర్థవంతంగా ఆ పరిసరాలను సృష్టించి చూపగలదు. పురుషుడు స్త్రీకి ప్రకృతి ఏర్పరిచిన తోడు మాత్రమే. అవసరం కాదు.*

కరుణకుమార్

# 8 పుష్పలత నవ్వింది





పెదరైతు గారి మనవరాలు మంగ పొద్దున్నే సంవర్తాడిందని మా పక్కింటి  అప్పిలమ్మ సెప్పగానే, గిన్నిలు తోముతున్న  మాయమ్మ మొకం సీకటైపోయింది.  సింతసెరువు దగ్గర ఎర్రతువ్వాలుతో పట్టిన పిత్తపరిగెల్ని తువ్వాలు సివర్న మూట కట్టుకోని అప్పుడే ఇంటికొచ్చిన మా నాయిన ఆ కవురు విని అరుగు మీద కూకండబడిపోనాడు. నేను ఆ తువ్వాల్లోని సేపల్ని, కొంచం పసుపు గుండని, కొంచం ఉప్పుని తబుకులో యేసి  సేపలు  బాగుసేస్తన్నట్లు నటించుకోని  ఆల్లిద్దరు ఏటి మాటాడుకుంటారోని ఒక సెవి అటు ఒగ్గిసి పొలుసులు గీరుతూ కూకున్నాను.

పొద్దుపొద్దున్న ఆళ్లిద్దరు ఎందుకలగ  మొకాలు సిన్నవి సేసుకున్నారో సెప్పాలంటే, మా ముగ్గురి గురించి ముందు మీకు తెలియాల. సెప్తాను.  నా పేరు పుస్పలత. నేను తొమ్మిది సదవతన్నాను. నేను మంచి క్లవరు, సేన బాగా సదువుతానని మా టీచర్లకి నేనంటే ఇష్టము. ఒక్క దాన్నే కూతుర్నని, బాగ సదువుతానని, ఆళ్ల నాన్నలాగ నాకు సూది ముక్కు ఉంటాదని మా నాయినకు నేనంటే గొప్పిష్టము. మా నాయిన నన్ను లతమ్మా అని లేపోతే ‘అమ్మీ’ అని పిలుస్తాడు.

మాయమ్మ, మా నాయిన మాకున్న మూడెకరాల మాగాణిల సమ్మచ్చరం  మొత్తం రైతాంగం సేసి అరవై పుట్ల ధాన్యం కొలుస్తారు. ముప్పై పుంజీల కుండల బెల్లం ఎత్తిబెడతారు. మాకు ధాన్యము, చెరుకు రెండే పంటలు. మాయమ్మ మా ఇలకాలున్న పశువుల సాల పక్కన వర్రకాయలు, ఉల్లిపాయలు సమచ్చరమంతా పండిస్తాది. సీకటితోటి లెగిసి నీళ్లు పోసుకోని, తులిసి పీని కు మొక్కిసి, పొయిముట్టించి మా యమ్మ పన్లు మొదులుపెట్టిందంటే  రాత్రి తిళ్లు తిన్నిదాకా ఎదో ఒక పని సేస్తూనే ఉంటాది. ఏడిసి మొకం కడుక్కున్నట్లు మొకం పెట్టుకుని, పొద్దంతా పని సేస్తూ ఉంటాదని, ఏదో ఒక వంక పెట్టి నన్ను తిడతుంటాదని మా యమ్మను మా నాయిన, ‘ఒలే జడ్డిముండా.. దాన్ని తిట్టినావంటే నీ దవడ పేలగొడతాను, సిన్నపిల్ల ..దానికేటి తెలుసు,’ అని నాకు సపోర్టు

సేస్తాడు. అప్పుడు మా యమ్మ మా నాయిన దుక్కు ఒకసారి సూసి మల్లీ పనిసేసు కుంటాదిగాని జెబాబివ్వదు.

మా మేనత్త లచ్చుమమ్మ మా ఇంటికొచ్చినప్పుడు మాత్రం 'జడ్డిముండ' అని మా నాయిన పిలిసినాడంటే మాయమ్మ మా నాయినకేసి అగ్గి పుట్టిపోయినట్లు ఒక సూపు సూస్తాది. అప్పుడు మాత్తరం మా నాయిన సల్లబడిపోయి మెల్లిగ అక్కడ్నుంచి లెగిసిపోయి సుట్ట తాగడానికి ఎలిపోతాడు. మాయమ్మ నేను మొకాలు సూసుకొని నవ్వుకుంటాము.

మా నాయనకు అక్క మా లచ్చుమత్త. ఆల్ది టెక్కలి. మా ఊరికి దగ్గిరే. మా మామ ఆరు సమచ్చరాల క్రితమే ఊష్టం వచ్చి ఆస్పత్రిలోనే సచ్చిపోయినాడు. మా లచ్చుమత్తకు ఒకడే కొడుకు. ఆడి పేరు తిరపతి. ఆడు నాకన్నా నాలుగేళ్లు పెద్దోడు. నేను పుట్టినప్పుడే ఆడికి నాకు పెళ్లి సేసేస్తామని మా లచ్చుమత్త, మా మామ, మా నాయిన అనుకున్నారంట. సిన్నపుడ్నుంచి ఆడి సీకు కళ్లు, సీముడు ముక్కు నాకు బొత్తిగా నచ్చవు. మాయమ్మకు ఆ కుటమామితో సమ్మందమే ఇష్టం లేదు.

'మన బూవిని పడీసుకోడానికే ఆ గొద్దిరోడికి నీకు పెళ్లంటాది మీయత్త. భూమి మీయత్త సేతికెళ్లిపోతే, నాకు మీ నాయినకు ముసిలైపోతే బుక్కడు గంజి పుట్టదు. ఆ ఇంటికెల్లి నువ్వేటి సుకపడతావు. కోడి పియ్యి ఎత్తడం, పోక బొమ్మళ్లించటం. మేము సెడిపోయి ఆ గడపకొచ్చినా నీ సేత మాకు ఒక ముద్దా పెట్టనివ్వదు,' అని మా నాయిన సెవిల పడినట్లుగా అంటాది మా యమ్మ. మా నాయిన మొకం ఎర్రగా సేసుకొని ఆళ్లప్ప మీద అభిమానంతోటి మాయమ్మను గట్టిగ గసురుతాడు. మాయమ్మ అలాగంటాదిగాని మా లచ్చుమత్త సెడ్డది కాదు. అది మాయమ్మకు కూడా తెలుసును.

మా యత్తంటే నచ్చదంటాది కానీ ఆడబొట్టి వచ్చినప్పుడు మాత్రం మద్దాన్నెం పూట పేలు చూపించుకొని మా ఊరిలోని కవుర్లన్నీ మాయత్తకు కతలు కతలుగా చెప్తాది మా యమ్మ. మా లచ్చుమత్త ఊరినుండి వచ్చినప్పుడు నాకోసం ఆళ్ల పెరటి నుండి సంచీడు గోరింటాకు తెంపుకొనొస్తాది. మా నాయనకు ఇష్టమని మా తిరుపతి బావ పెంచుతున్న కోళ్ల నుండి ఒక నాటుకోడి పట్టుకొనొస్తాది. మాయమ్మ కోడిని కమ్మగా కూరొండితే మేము నలుగురం కళాయికి నొప్పెట్టిందాకా గీరుకోని గీరుకోని ఆ కూర తినీసి, బొంతలమీద పడుకుంటే మాయత్త ఆళ్ల ఊరు కవుర్లు మాయమ్మకు సెప్పుకుంటుంటే నేను అవి యింటూ తొంగుంటాను.

మంచి పెల్లము, బాగా సదువుకునే కూతురు, కొడుకుని పట్టుకోని రడీగా తిరుగుతున్న అప్ప, మూడెకరాల మాగాణి, మా నాయినంత అదృష్టమంతుడు లేడని మా ఊరిలోన అందరూ సెప్పుకుంటారు. నేను ఎనిమిదో తరగతికొచ్చిన దాకా పరిస్తితి ఇలాగే ఉన్నాది. ఎనిమిదోతరగతిలోనే ఈ బాద మా ఇంటిలోనికొచ్చినాది. మా క్లాసు మెట్లందరూ పెద్దపిల్లలయి పోయి, తొమ్మిదో తరగతి వరకు నేను సాప మీద కూకో లేదని ఇంట్లోన మాయమ్మకి, నాయినకి దిగులు పట్టుకున్నాది. నేను సంవర్తాడితే మా వీదిల సామియానా యేసి మేకమాంసంతో సంవర్త బోజి ఎట్టడానికి, మా నాయిన ముప్పైవేలు బాంకులోన వేరేగా ఉంచినాడు.

మా అయ్యమ్మ సచ్చిపోయిన తర్వాత పెదకార్యం అయిపోయినెంటనే ముసిల్దాని బంగారం వాటాలేసుకున్నారు మాయత్త, మా నాయిన. మా వాటాకి వచ్చిన మా అయ్యమ్మ ముక్కు బులాకి, సెవిట్లోని తమ్మెట్లు, మెడలోని పట్టెడ పట్టుకొని మాయమ్మ మా పక్కూరు రెంటికోటలోని కంసాలోల్ల దగ్గర కరిగించి, దిమ్మ సేయించి మొత్తం ఎనిమిది తులాల బంగారం బీరువాల పెట్టీసింది. నేను పెద్ద మనిసినవ్వగానే మూడుతులాలకి మెడలోకి, రెండుతులాలకి సెవిట్లోకి నాకు సేయించి, మూడు తులాలకి నందివర్ధనం పూల డిజను నకిలీసు సేయించుకుంటాను అని మాయమ్మ మా యత్తతో సెప్తాండీది.

ఎనిమిదో తరగతి అయిపోయింతర్వాత యేసవిసెలవుల్లో మా క్లాసుల మిగిలిన ఆడగుంటలు కరణాలమ్మాయి రాజేస్వరి, తెలకలోళ్ల కమల పుష్పవతులై పోయినారు. మా లచ్చుమత్త వచ్చినప్పుడల్లా, 'ఎప్పుడు మూల కూకుంటావే, ఎప్పుడు తిరపతిగాడిని పెల్లి సేసుకుంటావే,' అని అడుగుతుండీది. కళ్లు మూసి కళ్లు తెరిసి నప్పుడికి రోజులు గిర్రున తిరిగిపోతున్నాయిగాని నేను పెద్దమనిషి కాకుండా శీలవతి లాగ మిగిలిపోతానేమో అని మాయమ్మకు, నాయనకు బెంగ పట్టుకున్నాది. మా ఊరిలోన నా ఒయసు ఆడగుంటలు తొమ్మండుగురు. నేను తొమ్మిదోతరగతి కొచ్చి నప్పడికి ఏడుగురు పెద్దమనుసులైపోయినారు. నేను, పెద రైతుగారింటి మంగ ఇంకా అవ్వలేదు. నాలాగే కూకోడానికి ఇంకొక మనిషి ఊర్ల ఉందని మాయమ్మకు, మా నాన్నకు కొంచం దైర్యంగా ఉండేది. ఇదిగో ఇప్పుడు పెదరైతుగారి పిల్ల సంవర్తాడిం దనగానే మాయమ్మ, మా నాయిన తడిసిపోయిన సొప్పకట్టల్లాగ అయిపోగానే మొదటి సారి నేను పెద్దపిల్లనవ్వనేమో అని నాకు బయ్యమేసింది. నెలానెలా ముట్టుగుడ్డలు పులుముకోటం నాకూ సరదా కాదు. కానీ సచ్చిపోయిన మా అయ్యమ్మ బతికు న్నప్పుడు సింతపండు పిక్కతీస్తూ ఊర్లున్న ఆడగుంటలకని తోడుగా సాయానికి కూర్సో

పెట్టుకొని, 'ఆడపిల్లన్నాక పుష్పవతవ్వాల, ఓణీ యేసుకోవాల, వీదిల తిరగడము తగ్గించాల, ఇంట్లోనే ఉండాల, మొగపిల్లల తోటి సావాసం తగ్గించాల, పెళ్లి సేసు కోవాల, పిల్లల్ని కనాల, పురుడుకీ బారసాలకీ కన్నోరుకు కర్సుపెట్టించాల,'ని నోరు కంపుకొట్టేదాకా సెప్పేది. నేనూ సింత బొట్టలు సప్పరించుకొని తింటూ యినేదాన్ని. కానీ ఇప్పుడు నేను ఆడపిల్లను కాదా అని బెంగేస్తంది.

ఈవేళ మా నాయిన అరుగు మీద కూకున్నోడు అలాగే ఆలోసనలోన పడి పోయినాడు. మా యమ్మ గిన్నిలు తోమీసి మా నాయినకు పకాళణ్ణం పెట్టి పిలిస్తే లెగిసొచ్చి తినాల కాబట్టి తినాలన్నట్లు తినీసి ఇలకాల బక్కల దొడ్డికి ఎల్లిపోయి సుట్ట ముట్టించుకొని కూకున్నాడు. మాయమ్మ కొంచేపు సూసి, 'ఇలాగ కూకుని ఆలోసిత్తే అది మూల కూకుంటాదా? మంగ ఈపొద్దే కదా కూకున్నది. మన లత కూడా ఈ నెల పదిరోజుల్ల పెద్దమనిసైపోద్దిలే,' అని మా నాయినకు దైర్యం సెప్పింది. మా నాన్న సుట్టను ఆర్పీసి బక్కలదొడ్డి పెణకలోన ఆ ముక్కను దోపుతూ, 'రేపు పొద్దున్న మందస రెయ్యమ్మ దగ్గరికి దీన్ని తీసుకోనెల్లి అడిగించాల. ఇప్పుడికే ఆలిసిమై పోయింది,' అన్నాడు.

ఆ మరష్టినాడు పొత్తూరకముందే నేను, మాయమ్మ, మా నాయిన మందస ఎల్లాము. రెయ్యమ్మ నా మొకంమీద ఏపాకుల మండ పెట్టి మంత్రాలు సదివింది. మా నాయిన సిన్నప్పుడు బక్కలు మేపుతున్నప్పుడు ఒక ఆడపామును సంపీసాడని, ఆడపాము బర్త మొగపాము మా నాయిన్ని సెపించీడం వల్లే నేను బయిష్టవడం లేదనీ సెప్పింది. ఆరువందలిస్తే పూజసేసి ఆ దోసం పోయినట్లు సేస్తానని పదిహేనురోజుల్లో నేను పెద్దపిల్లనయిపోతానని సెప్పింది. మా నాయిన లోపలి జోబీల సెయ్యిపెట్టి యాభై రూపాయల నోట్లు తీసి లెక్కబెట్టి రెయ్యమ్మకి ఇచ్చినాడు. మేం తల్లి ముగ్గురం ఊరికి పారొచ్చాము. దారిల మా నాయిన రెయ్యమ్మ దగ్గిరికెల్లిన సంగతి ఊర్లోట ఎవరితోటి సెప్పొద్దని సెప్పినాడు. నేను అలగేనన్నాను.

రెండు నెలలైనా రెయ్యమ్మ సెప్పినట్లు జరగలేదు. మా లచ్చుమత్త కూడా మా ఇంటికి రావడం మానీసింది. మా నాయిన ఈ మజ్జెలో గుమ్మలచ్చిమిపురం సాదు దగ్గిరకి, బరంపురం పండా దగ్గిరకి, పలాస సిల్లంగోడి దగ్గిరికి ఎల్లొచ్చినాడు. డబ్బులు కర్సుపెట్టించి అందరూ పూజలు సేసినారు కానీ పని జరగలేదు. ఈ మజ్జె కాలంలో మా నాయిన ఎప్పుడు లేనిది గెడ్డం పెంచుకొని తిరగతన్నాడు. మాయమ్మ గట్టిగ తిడితే తింటన్నాడు. సుట్ట ముట్టించుకోని ఇలకాల బక్కలదొడ్డి పక్కన పెద్ద రాయి మీద కూకోని ఆలోసిస్తూ ఉన్నాడు. ఊరిలోట ఎవరితోటి మాట్లాడ్డం లేదు.

సుడి సుట్టీసినోడిలాగ, దెయ్యము పట్టీసినోడిలాగ మా నాయిన రోజురోజుకి అలాగై పోతుంటే మాయమ్మ ఒకరోజు మా నాయినను పట్టుకొని దులిపీసింది.

'నువ్వు ఏరు పూసి బక్కల్ని తోలుకుని ఈదెంట ఎల్తే నీకన్న అదృష్టమంతుడు ఎవలూ లేరని అనుకున్న గుడిశెట్టి ముండలు ఈపొద్దు నీ దుక్కు సూసి ఊసులేసు కుంటన్నారు. ఇప్పుడేటై పోయింది? పిల్ల సంవర్తాడలేదు. మీయప్ప ఇంటికి రావడం లేదు. అంతేకదా. నా కూతురికి ఇరవై సమచ్చరాలా? ముప్పై సమచ్చరాలా? పద్దెని మిదికి, పంతొమ్మిదికి పెద్దమనుసులైనోలు లేరా? నువ్వలగ పెల్లం సచ్చిన గండడి లాగ ఉండకు. రేపు నేను పిల్లను తీసుకొని మా కన్నోరింటికెలతన్నాను. నువ్వా ఈకలు గీసుకొని, మంచి గుడ్డలేసుకోని, నవ్వు మొకంతోని అక్కడకొస్తే నీ ఎంటా స్తాము. లేకపోతే లేదు,' అని తగువుపెట్టుకోని కర్రల బ్యాగులోన గుడ్డలు సర్దడం మొదలెట్టింది. మా నాయిన సన్నిరాయిలాగ కదలకుండ కూర్చున్నాడు. ఆ రెయ్యంతా మా నాయిన, మాయమ్మ తొంగోలేదు. నాకూ సరిగ్గ నిద్దరపట్లేదు.

వేకూజామున మాయమ్మ ఎప్పుడు లెగిసిందో నన్ను లేపీసింది. ఇద్దరమూ బయల్దేరినప్పుడికి మా నాయిన లెగిసి సుట్ట ముట్టించుకుని అంగట్ల కూకున్నాడు. మా యమ్మ కర్రల బ్యాగు పట్టుకుని మా నాయిన దుక్కు సూసి, నన్ను పదమన్నట్లు సైగ సేసింది. మా నాయిన నా దుక్కు ఒక ఎర్రిసూపు సూసి మళ్లీ సుట్ట తాక్కొంటూ ఉన్నాడా! మా యమ్మ గబగబా అడుగులేసి ఎల్లిపోతుంటే, నేను, 'ఎల్తన్నాను నాయినా,' అన్నాను. మా నాయిన తలూపాడు. నాకు మా నాయిన్ని అలగ సూడగానే గొప్ప దుక్కమొచ్చింది.

రెండు బస్సులు మారి మాయమ్మమ్మగారి ఊరికొచ్చినాము. ఆ ఊరు మా ఊరంత బాగోదు. రోడ్డుమీదకే సెంబు పట్టుకొని దొడ్డికెళ్లాల. మగోళ్లు నడుచుకోనో సైకిల్లమీదో రోడ్డంట వస్తే గబుక్కున నిలబడాల. నాకు అప్పుడు మొకమంతా ఎర్రగైపోద్ది. వచ్చింది కూడా ఆగిపోద్ది. అందుకే ఈ ఊరు రావాలంటే నాకు అసలిష్ట ముండదు . మేము ఊరికొచ్చినామని మా అమ్మమ్మగారి బాగార్లు ఒక్కక్కళు వచ్చి పలకరించినారు. వచ్చినోళ్లు సకంమంది నేను ఇంకా పెద్ద పిల్ల అవ్వలేదని మా అమ్మ దగ్గర బాదపడినారు. నేను మా యమ్మమ్మ చేసిన సోడిపిండి సక్కులు తినుకోని కూకున్నాను. నాకు మా నాయిన ఏటి సేస్తన్నాడో తిన్నాడో లేదోనని ఆలోసనయి పోయింది. పొయ్యి కాడ కూకుని మా యమ్మ, మా యమ్మమ్మ ఊసులేసుకుంటు న్నారు. ఇద్దరి మొకాలు మాడిపోయి ఉన్నాయి. ఆళ్లిద్దరు నాకోసమే మాట్లాడుకుంట న్నని అరదమయిందిగానీ ఆ మాటలు ఇనాలనిపించలేదు. మా యమ్మ గబుక్కున

లెగిసి సీర సదురుకుంటూ, 'లతమ్మ! రేపు మనం స్రికాకులం ఎల్లాల. నీకు డాక్టరుకు సూపించాల,' అన్నాది. స్రికాకులం అంటే బస్సులోన ఒక రెండు గంటలు కూకోని కిటికీనుండి బయటకు సూసుకొని ఎల్లడం కాబట్టి, నాకలగ బస్సులోట కూకుని బయట కొండలు, పొలాలు సూడటం ఇష్టం కాబట్టి తలూపీసాను.

మా యమ్మమ్మగారి ఊరి నుండి స్రికాకులానికి ఒకటే బస్సు. అక్కడ దిగ్గానే తిన్నగ ఆస్పట్లకి తీస్కెల్లిపోయింది మా యమ్మ. డాక్టరమ్మ, మాయమ్మ ఎదో మాట్లాడుకున్నారు. తర్వాత నన్ను ఒక మిషను మీద తొంగొండబెట్టి అటూ ఇటూ తిప్పినారు. ఆ రూము సల్లగా ఉంది. కొంచేపటికి మా యమ్మ సేతికి ఒక ఫైలు ఇచ్చినారు. మాయమ్మ జాకెట్టులోంచి సిక్కం తీసి డబ్బులు కట్టింది. అన్ని డబ్బులు మా యమ్మ ఎలగ సక్కబెట్టుకొని వచ్చిందో. మల్లీ కొంచేపటికి డాక్టరమ్మ మా ఇద్దర్ని ఆవిడ రూములోకి పిలిసి నా రిపోర్టులు సూసింది. మాయమ్మతో, 'పిల్ల పెద్దమనిషవ్వడం కష్టమమ్మా! ఇలాంటి కేసులు మా దగ్గిరికి వస్తుంటాయి. కొంతమందికి అయ్యే అవకాశం ఉంటాది. మంచి తిండి లేకపోతే పెరుగుదల ఉండదు కొంచం లేటుగా అవుతారు. మీ అమ్మాయికి ఆ అవకాశం లేదు,' అని సెప్పీసింది.

మా యమ్మ కల్లు నిండుగ నీల్లు తిప్పుకొని, 'ఒక్కగానొక్క కూతురమ్మా. దీనికి ఒక పెల్లి సేసి ఒకింటికి పంపడానికి మాకు బాగ్యరేఖ బగమంతుడు రాయలేదు. నా పెనిమిటి దీనిమీద బెంగెట్టుకొని తిండి, తొంగోడం మానీసి మనిసి సగం సచ్చిపోయినాడు. ఇప్పుడు మేమేమిటి సెయ్యాల,' అని ఏడుసుకోని అనింది. డాక్టరమ్మ మా యమ్మని బోదపెట్టి మాట్లాడినట్లు, 'అలాగేమీ లేదు. పిల్లకి పిల్లలు పుట్టరన్నమాటే గాని, చక్కగా కాపురం చేసుకోవచ్చు. చాలామందికి తెలీక పెల్లి చెయ్యకుండా వదిలేస్తారు,' అని అన్నాది. కొంతమంది ఆడపిల్లలకి మాత్రం అలాగ ఎందుకవుతుందో, దానివల్ల ఎలగ నష్టం లేదో కొంచేపు మాయమ్మకు అర్ధమైనట్లు సెప్పి నాకు బలానికి రెండు టానిక్కులు రాసి ఆ మందుల సీటీ మా యమ్మకు ఇస్తే, మా యమ్మ ఆస్పటిల్ నుండి బయటకొస్తున్నప్పుడు ఆ సీటిని సింపీసింది.

దారంతా మాయమ్మ నాతోటి ఒక్కముక్క మాట్లాడలేదు. ఇంటికెల్లిన తరువాత మా యమ్మమ్మ, మా యమ్మ కొంచేపు ఊసులేసుకున్నారు. మా యమ్మమ్మ కూడా ముక్కు సీదుకోని కొంచేపు ఏడిసింది. ఆల్లిద్దరి ఏడుపు సూసినప్పుడు ఈ సంగత్తెలిస్తే మా నాయిన ఇంకెంతేడుస్తాడో, ఏటైపోతాడో అని నాకు మాత్రం గొప్ప బయమేసింది. నావల్లే కదా ఈళికీ బాద? ఏ గన్నేరుపప్పు తినీసో, ఎండ్రిన్ తాగీసో సచ్చిపోతే బాగున్ను అని ఒక సిటం అనిపించింది.

కొంచేపటికి మా యమ్మ మొకం తేటగా సేసుకొని నా దగ్గరకొచ్చి కూకోని, 'లతమ్మా! నేనొకటి సెప్తాను సేస్తావా,' అనడిగింది.

తలూపినాను.

'రేపు పెందిల ఊరికెలిపోదాం. ఈ రాత్తిరి నువ్వు పెద్దమనిసై పోయావని నేను ఊర్ల సెప్పేస్తాను. నేను సెప్పింది యినాల. నేనేం సేసినా ఎందుకు సేస్తన్నానో అడక్కూడదు. పేణం పోయినా ఈ తొమ్మిది రోజులు జరిగిన యిసయం నువ్వు సచ్చిపోయిందాకా ఎవరికీ సెప్పకూడదు. చివరాకరికి మీ నాయినకి, మీ మేనత్తకి, నీ నేస్తపురాల్లకి ఎవరికీ ఎప్పుడికీ సెప్పకూడదు. ఇది నీకు, నాకు, అమ్మమ్మకి మజ్జినే ఉండాల. ఒకేల నువ్వు ఎవులుకైనా సెప్పేసినావంటే ఈ యిసయం తెల్సి మీ నాయిన ఒక్క సిటం కూడా బతకడు. నేను పెరట్లోన చించెట్టుకు ఉరేసుకొని సచ్చిపోతాను. లేదూ... నేను సెప్పినట్లు యింటానంటే నీ బతుకు బాగుంటాది. మీ నాయిన బాగుంటాడు. నువ్వింకా సిన్నపిల్లవి కాదు. మన కుటమామును నలుగురు సూసి నవ్వకుండా ఉండాల, బోదపడిందా?' అన్నాది.

కొంచేపు ఆలోసిస్తే మా యమ్మ సెప్పింది నాకు బోదపడింది. 'ఒలమ్మా .. నీకంట నాకు నాయినంటే ఇష్టము కదా? నాయిన మీద ప్రెమానం సేసి సెప్ప తన్నాను, నువ్వెలగ సెప్పితే అలగ సేస్తానమ్మా. నా పేణం పోయినా ఈ సంగతి ఎవలికీ సెప్పను,' అన్నాను. మా యమ్మ నన్ను సూసి నవ్వి, నా నుదురు మీద ముద్దు పెట్టుకున్నాది. ఆ రాతిరి మాయమ్మ ఒంటిమీద తెలివి లేకుండ తొంగున్నాది.

సీకటితోటి మా యమ్మ, మా యమ్మమ్మ నన్ను లేపినారు. మా ఎనకాల మా యమ్మమ్మ కూడా మా ఊరికి బయల్దేరింది. ఊరులోన ఎల్లైసి ఏజంటు కోమటి గురుమూర్తికి ఫోన్ సేసి నేను మైనరు తీరిపోయానని మా నాయినకు సెప్పమని సెప్పేసి మేము మా ఊరికి ఆటో కట్టించుకొని బయల్దేరినాము.

మేము ఊరికి పారొచ్చినప్పుడికి మా నాయిన మొకమంతా పళ్లు సేసుకొని నవ్వుకోని ఎదురొచ్చినాడు. మా నాయిన అంత సంతోసంగా ఉండడం సూసి సాన్నాళ్ల య్యింది. నవ్వుమొకంతో నా దుక్కు సూసి, 'లతమ్మా బాగున్నావా?' అనడిగినాడు. ఆకాసం దుక్కు సూసి దండం పెట్టి, మా యమ్మతోటి, 'దేవుడున్నాడే సచ్చవతీ!' అన్నాడు. ఇలాంటప్పుడే మా యమ్మను మా నాయిన పేరుతో పిలడం. మా యమ్మ మా నాయిన తోటి, 'ముందెల్లి గెడ్డం గీసుకొని నీలు పోసుకొని మీయప్పకు కవురు సెప్పు. మీ యప్ప, తిరప్తి బయల్దేరి బేగొస్తే పిల్లను కూకోబెట్టాల. ఎండ రాకముందే సాప అల్లించాల. కంసాలోడికి కవురుపెట్టాల,' అని దారంతా మాట్లాడుకోనే ఉన్నాది.

ఎప్పుడు మా యమ్మను ఎదో ఒకటి ఇగాటమాడే మా నాయిన ఆ పొద్దు మా యమ్మ సెప్పిన పనులన్నీ గొప్ప జాగర్తగా ఆలకించినాడు.

ఆ తరవాత తొమ్మిది రోజులు సందడంతా మా ఇంట్లోనే ఉన్నాదా అని మా ఊర్లున్నోల్లు ఊసులేసుకున్నట్లు మా నాయిన నా పెద్దమనిసి బోజీని సేసినాడు. కవురు తెలగానే శాన్నాళ్లుగా మా ఇంటికి రావడం మానీసిన మా లచ్చుమత్త, కొడుకుని ఎంటబెట్టుకొని సంచినిండా గోరింటాకు, రెండు బలిసిన కోళ్లు పట్టుకొనొచ్చి, 'నా కోడలా.. నా తమ్ముడా,' అని కొంచేపు అడావిడీ సేసింది. మా యమ్మకు అన్న దమ్ములు లేరని, నాకు మేనమామ వరసకొస్తాడని మా ఊరి పంచాయితీ నెంబరు కోటేసురావు మామతోని పచ్చటి కొబ్బరి సాప అల్లించి పరిసినారు. మా లచ్చుమత్త మేనత్త గాబట్టి రివాజు ప్రకారము నన్ను కూకోబెట్టింది. మా తిరప్తి బావ, మా నాయిన కలిసి కొబ్బరిమట్టలతోటి పచ్చపచ్చగా ఒక పెద్ద పందిరి ఏసినారు. నా ఫ్రెండ్సు వస్తే కూకోడానికి రెండు బల్లలేసినారు. నా దగ్గర ఎప్పుడూ తోడుగా కూకోడానికి మా సుట్టాల పిల్లను కూకోబెట్టారు. మా లచ్చుమత్త పందిరి బయటే కూకోని వచ్చినోలుకీ పోయి నోలుకీ నేనే దాని కోడలినని సెప్పుకోని, ఒక మూడిటికల పొయ్యి పెట్టీసి అక్కడే అరిసిలు, సుప్పులు, పందార సిలకలు, బూందీ లడ్లు, పొంగడాలు సెయ్యడం, పప్పుల వంటకి సాయంకొచ్చినోల్లతోని ఊసులేసుకోడం, పేలు సూపించుకోడమూ సేసింది. మాయమ్మ పొద్దున్న తిరుపతి బావ బండిమీద బయలుదేరి ఎల్లిపోయి పొద్దోయికి బట్టలో బంగారమో పట్టుకొని పారొచ్చేది. మా నాయిన పొత్తూరినప్పుడికి టింగురంగడి లాగా తయారైపోయి బోజికి సుట్టాల్ని పిలడానికి ఎల్లడము, మజ్జానానికి పారొచ్చి, పందిరి దగ్గిర కూకోని వాయి దిగుతున్న పప్పులు తినుకోని లచ్చుమప్పతోని ఇకైకలు పకపకలు, ఇగటాలు- అంతే. ఈ తొమ్మిదిరోజులు ఒక కంప పని లేదు, బక్కల పని లేదు, పొలం దుక్కు ముక్కెట్టి సూసింది లేదు. మా నాయిన నిలబడడు, కూకోడు.

సివర్రోజు నాకు నీళుపోసి మా యమ్మ పట్టుబట్టలు కట్టించింది. వాడంబరం పువ్వు రంగు వోణీ, సిలకపచ్చ రంగు లంగా, జాకెట్టు తొడుక్కొని కొత్త నగలేస్కోని నేను స్టేజి మీద కూకున్నాను. మా ఫ్రెండ్సు కొంతమంది నా దగ్గిర కూకున్నారు. మా నాయిన రెండు మేకలు కోసి, నరసన్నపేట వంటోల్లను పెట్టి ఊరందరు గక్కురుమని పోయినట్లు బోజి పెట్టినాడు. ఆరోజు మా నాయన గడిగడిక్కి నవ్వుతూనే ఉన్నాడు. మా ఊరి సాకలోళ్లు ముట్టుబట్టలు అడగడానికొస్తే మా యమ్మమ్మగారి ఊరిల నేను పెద్దమనిసయ్యాను గాబట్టి అక్కడ సాకలోళ్లకే మైలగుడ్డలు ఇస్తానని ఒప్పుకున్నానని సరిదిసెప్పి మా యమ్మ ఆళకి రెండు సీరలిచ్చి పంపించీసింది.

ఈ తొమ్మిది రోజులూ ఇక్కడే ఉండిపోయిన మా లచ్చుమత్త ఆళ్లూరికెల్ల డానికి బయల్దేరి, గడపమీద కూకోని నా బోజికొచ్చిన ఈడుల డబ్బు లెక్క సూస్తున్న మా నాయనతో, 'ఐరా నారాయణా! యిప్పుడు వరకు పిల్ల మైనరు తీరలేదని ఉన్న బాద మరిప్పుడు లేదు. జంగమయ్యకు సూపించి మంచి రోజు అడిగించి టెక్కలొచ్చి నారంటే ఒక మాటనుకొని ఆ మరష్టీ వారమే పిల్లకి రెండుతులాల గాజులు సేయిం చీసి మాది అనిపించుకుంటాను, ఏటంటావు?' అని అడిగింది.

బోనిపెట్టిలోన పొంగడాలు తీసి మా యత్తకు ఇవ్వడానికి కవర్లోన ఏస్తన్న మాయమ్మ ఆ మాట యినగానే కవర్ని అక్కడికక్కడే పడీసి మాయత్త మీదకి తాను పాములాగ ఎగిరింది.

'మొగుడు సచ్చి, ముండమోసిన మూన్నెల్లకు ముత్తైదువ పేరంటానికి పిలడానికొచ్చిందట నీలాంటి సుప్పనాతి! పిల్ల ఎదగడము కొంచం ఆలీసం అవ్వగానే తమ్ముడింటికి రాకుండా నువ్వు, నీ కొడుకు ఆ సర్దాపురము, గంగువాడ, ఈదాలపల్లి సమన్దాల కోసం తిరగడం నాకు తెలీదా? మా తమ్ముడి కూతురు సమర్తాడ్లేదు, రేప్పొద్దున ఆ పిల్ల మా ఇంటికొచ్చి గొప్ప తీసుకొని, గాబేరుకొని, పేడ ఎత్తుకొని మా తిరప్తికి కొడుకో కూతురో పుడితే ఆళ గుద్దలు కడుక్కుని ఇక్కడే ఉంటాదని ఎంత మందికి సెప్పుకోని తిరిగినావొ నాకు తెలీదా? నా మొగుడు అమాయికుడు. అప్ప నాలుగు పప్పలొండీగానే నమ్మేస్తాడు. కానీ నేనలక్కాదు, ఇప్పుడు సెప్పతన్నాను ఇనుకో. నా కూతురు ఆ ఇంటికి రాదు. ఆ కోడిపియ్య ఎత్తదు. నువ్వు మేనత్తవి, ఈ కార్యముల పిల్లని నువ్వే కూకోబెట్టాలని నీకు కవురు సెప్పినాముగాని, లేకపోతే నువ్వు నీ కొడుకు ఈ గడపెక్కడమే నాకిష్టము లేదు. నా మనసిరిగిపోయింది,' అని బఁరున ముక్కుసీదింది.

మా యత్త ఆ మాటకి ఈదిలోన నిలబడి సేతులు తిప్పుకొని, 'ఒక్క పిల్లడు, నీ కూతురు సుకపడతాదని మీ గడపలంట తిరిగినాను. పిల్ల ఎప్పుడికీ మూల కూకో కుంటన్నది. పిల్లడు మంచోడు, కోళ పారమెట్టుకొని సుబ్బరంగ బతకతన్నాడని తెలిసి సమందాలొచ్చినాయి. మగపిల్లడి తల్లిని. ఆశపుట్టి ఎలినాను. నీ కూతురు కూకుందని తెలంగానే పరిగెట్టుకోని రాలేదా? మొదట్నుండి మా మొకాలే నీకు పడవు. నా బెండా బెరిసి తమ్ముడు నీ మాయిలోన పడిపోయినాడు. ఆడికి ఎప్పుడు ఏ మందు పెట్టినావో ఏ మాకు ఇచ్చినావో మంటిబుక్కడమైపోయినాడు. నువ్వు బాగుపడవు. పురుగులు పడి సస్తావు,' అని ఈదిలోని బుగ్గిని మా ఇంటి మీదకి ఇసురుకోని మా యమ్మను తిట్టడం మొదలెట్టినప్పుడికి తగువు పెద్దదయ్యింది.

ఊరి జనమంతా మాయత్త గొల్లుకి మూగినారుగాని మా నాయిన మొత్తం తగువులో ఒక్కమాట కూడా మాట్లాడకుండా కూకున్నాడు. మా యత్త సేసిన పని మా నాయనకూ నచ్చలేదని నాకరదమయింది. మాయత్త ఈదిలోన నిలబడి అరిసి అరిసి అలిసిపోయి ఎల్లిపోయింది. సాయంత్రము వరకు మా యమ్మ ఇల్లు సక్క బెట్టుకొనే ఉన్నాది. మా నాయిన పంచాయితాపీసు దగ్గర బాతాకానీకెల్లిపోయినాడు.

ఇలకాల బక్కల దొడ్డికాడ నేను సదువుకుంటుంటే మా యమ్మ నా పక్కన ఎప్పుడొచ్చి కూకుందో నా బుర్ర మీద సెయ్యేసి, 'లతమ్మా,' అన్నాది. మల్లీ కొంచేపు ఆలోసించుకోని, 'పొద్దున్న మీ యత్తతోటి కయ్యమాడినాను. ఇకను మీయత్త మన గడప ముట్టదు. మీ నాయిన ఏటి అనుకున్నాడో గాని ఆ ఇంటిల నువ్వు మసల్లేవు. నీకు పిల్లలు పుట్టకపోతే మీయత్త నీకు బతకనివ్వదు. ఏదో బాదపడి నీకు మంచి సమన్దం సూసి పంపించాలగాని, ఆ యింటికొద్దనే అలాగ మాట్లాడినాను,' అన్నాది.

నేను మాయమ్మతో, 'నేను ఎప్పుడికీ పెద్దమనిసవ్వనని, పిల్లలు పుట్టరని డాక్టరమ్మ సెప్పింది కదమ్మా! పెల్లి సేసుకొని ఏ ఇంటికెల్లినా ఇదే బాగోతం కదా?' అన్నాను కొంచం బెంగగా.

అప్పుడు మాయమ్మ బోదపరుస్తున్నట్లు నాదుక్కు సూసి, 'తులిసి మొక్కకు పువ్వు రాదని దేముడికి పెట్టడం మానేస్తన్నామా. ఆ తులిశమ్మనే పీనిలపెట్టి పూచ్చె య్యడము లేదా? లోకంలోట సొట్టపిల్లలు గుడ్డిపిల్లలు సెవిటిపిల్లలు పుట్టడం లేదా ఆల్లకు పెల్లి అవతంది కదా! బగమంతుడు నీకు ఈ అవకరం పెట్టినాడు. ఆడపుట్టు కంటే మొగుడితో పడుకోని పురుడవ్వడమేనా? మైనరు తీరకపోతే, పిల్లలు పుట్టకపోతే ఆడదాయి కాదా? అయినా టైముకి మైనరు తీరిపోయినోల్లందరికి పిల్లలు పుట్టే స్తన్నారా? మగోల్లకి అవకరం ఉండి పిల్లలు పుట్టకుండా ఉన్నోళ్లు మనూర్లోనే ఉన్నారు కదా! కరణాల పద్మ మొగుడికి పిల్లలు పుట్టరని డాకటర్లు సెప్పలేదా? ఆళు కాపురం మానేసి ఈదిల పడ్డారా! అలాగైతే పిల్లలు లేనోల్లకు పిల్లలు పుట్టిస్తామని టీవీల ఆస్పత్రులు సూపిస్తన్నారు కదా... మరి దానికేటి అనుకోవాల? ఏ అవకరం లేకుండా ఎవలుంటారు... నువ్వు బాగా సదువుకోని మంచి ఉజ్జోగం సేసుకుంటే నీకోసం వెయ్య సమందాలొస్తాయి. ఇంటికి ఇల్లరికం అల్లుడొస్తాడు. రాకపోతే లేదు, ఆడదాయి మగోడు లేకపోయినా బతగ్గలదు. నీ సంతోసం నువ్వు సూసుకోవాల. నీ సుకము, మీ నాయిన మొకం మీద నవ్వు ఇలగే ఉండాల. అందుకోసమే నేను, అమ్మమ్మ బాగాలోసించి మీ నాయిన దగ్గర ఈ ఒక్కబద్దము సెప్పాలనుకున్నాము,' అని సెప్పుతుండగా ఈతరెమ్మకు గుచ్చిన సెరువు సేపల్ని పట్టుకొని దువ్వారం దగ్గర

మా నాయిన కనిపించగానే మాట ఆపేసి మా నాయిన సేతిలోట ఏటుందా అని మాయమ్మ సూస్తుంటే, మా నాయిన అంగట్నుండే, “జడ్డిముండా! అలాగ సూస్తన్నావు గాని గబుక్కునొచ్చి సేపల్ని అందుకోవాలని సూడవేమీ?” అని కేకేసినాడు.

మాయమ్మ లేని కోపము తెచ్చుకోని, ‘పిల్ల మైనారు తీరితే తీరిందిగాని నీ నోరు బాగా రుసులెక్కిపొయింది. ఇంట్లున్న బెల్లంకుండలన్ని నీ సేపల తిండికే సరిపోయినట్లున్నాయని,’ గుణుసుకుంటూ ఒక తబుకు తీసుకొని మా నాయిన దగ్గిరకు గబగబా ఎల్తూ నా దుక్కు సూసి ఒక నవ్వు నవ్వింది.

మాయమ్మను జడ్డిముండా అని పిలిసిన మా నాయిన జడ్డితనము సూసి నాకు నవ్వొచ్చి, నేను మాయమ్మ దుక్కు సూసి నవ్వినాను.

*కొత్తకథ 2018*

✻




**కరుణకుమార్** మే 5 1977న కంట్రగడ గ్రామం, పలాస మండలం, శ్రీకాకుళం జిల్లాలో జన్మించారు. వీరి మొదటి కథ చున్నీ కొత్తకథ 2017లో ప్రచురితమయ్యింది. ఐదు కథలు రాశారు. కొన్ని సినిమాలకు కథ, స్క్రీన్‌ప్లే, మాటల విభాగాలలో పనిచేశారు. కొన్ని టీవీ షోలకు కూడా పనిచేశారు. ఇప్పుడు దర్శకుడిగా మొదటి సినిమా పలాస *1978*ను రూపొందిస్తున్నారు. ట్రావెల్ కన్సల్టెన్సీ నడుపుతున్నారు.

**చిరునామా:** **రోడ్ నెంబర్ 2, సబిత అపార్ట్‌మెంట్స్, ఫ్లాట్ నెంబర్ 5**
**బంజారాహిల్స్, హైదరాబాద్.**
***ఫోన్: 95509 72771 karunakumar06@gmail.com***